## క్లుప్తంగా

### లగుడు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



లగుడు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గణేష్

గొలుగొండ : ఏఎల్‌పురం గ్రామానికి చెందిన లగుడు శ్రీనివాసరావు (48)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడంతో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం ఉదయం పరామర్శించారు. శ్రీనివాసరావు భౌతికకాయానికి పూలమాలతో నివాళులు అర్పించారు. శ్రీనివాసరావుతో ఉన్న అనుబంధాన్ని గణేష్ గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ బుల్లిప్రసాద్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

### ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం : ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఏడీ రవికుమార్ ఆదివారం తెలిపారు. మాకవరపాలెంలో ఇచ్చే ఈ శిక్షణకు 15 నుంచి 45 లోపు వయసు నుండి, 10వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బీసీ కాలనీలో ఉన్న శిక్షణ కేంద్రంలోగాని, 7075340910 నంబర్‌ను కాని సంప్రదించాలన్నారు.

### ముగిసిన లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవాలు



లక్ష్మీనారాయణస్వామి వారు

మాడుగుల రూరల్ : మండలంలో వి.వి.అగ్రహారంలో గల శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. వి.వి.అగ్రహారంతో పాటు బంగారుమెట్ట గ్రామాల్లో స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త దొండా వరహాలుదొర (కుమార్), ఆలయ ప్రధాన అర్చకులు కిశోర్ సారథ్యంలో స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిసాయని ధర్మకర్త కుమార్ తెలిపారు.

### 25 తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



వ్యవసాయాధికారి వాసుదేవరావు

మాడుగుల రూరల్ : మండలంలోని రైతులు ఈ నెల 25 వ తేదీలోపు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో గల సచివాలయాల పరిధిలో గల రైతు సేవా కేంద్రాల్లో ఆయా గ్రామ వీఏఏ, లేదా వీహెచ్ఏ ఈ రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం లేదా, ఓబీ, పట్టాదారు పాసుపుస్తకానికి లింక్ అయిన ఫోన్ నంబర్‌ను తీసుకుని వెళ్లాలన్నారు. రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీ చేయించుకోవాలని, లేదంటే రాయితీలు అందే అవకాశం లేదన్నారు.

### జోరుగా మినప చేను కోతలు

మాడుగుల రూరల్ : అపరాలు పంట అయిన మినప చేను పంట తీసే పనిలో రైతులు ప్రస్తుతం బిజీబిజీగా వున్నారు. ఖరీఫ్ వరి కోతలు కోసిన తర్వాత రైతులు పెసర, మినుము, పిల్లిపెసర విత్తనాలు చల్లారు. అయితే అకాల తుపాను వర్షాల వల్ల కొన్ని చోట్ల విత్తనాలు కొట్టుకుని పోయాయి. తర్వాత రైతులు వ్యయప్రయాసలకు ఓర్చి మళ్లీ అపరాలు చల్లారు. ప్రస్తుతం మినప చేను పండింది. పంటను మడిలో తీసి ఒడ్డుకు చేర్చి నూర్పు మిషన్‌తో నూర్పు చేస్తున్నారు. పెసర, పిల్లి పెసర పంట ప్రస్తుతం పండలేదు.

### కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన తెలపాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము తెలిపారు. ఆదివారం స్థానిక కూడలిలో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన నోరు విప్పక పోవడం దారుణమన్నారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారన్నారు.

# 100 శాతం ఫలితాల కోసం..

#### పక్కాగా 100 రోజుల ప్రణాళిక అమలు

గత ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇప్పటికే పది పాఠ్యాంశాలను డిసెంబర్ 31 నాటికి ఉపాధ్యాయులు పూర్తి చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు రివిజన్ తరగతులతో పాటు గత పబ్లిక్ పరీక్షల మోడల్ పేపర్లపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం అందించిన సక్సెస్ మెటీరియల్‌ను కూడా విద్యార్థులకు అందించి వీటిపై కూడా ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు.

- పది పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం
- ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా 100 రోజుల ప్రణాళిక
- అదనపు తరగతులతో విద్యార్థుల సందేహాల నివృత్తి
- విద్యార్థి ఇంటికి వెళ్లి ఉపాధ్యాయుల సూచనలు



ఎ.కోడూరు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో సత్యనారాయణ



కె.కోటపాడు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్ష

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో పది చదువులు సాగిస్తున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించి ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయుడు బోధనలను అందిస్తున్నారు. పాఠశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థులలో బాగా చదువుతున్న వారిని , చదువుల్లో కొంచెం వెనుకబడిన వారిని ఏ,బి,సి,డిగా ఉపాధ్యాయులు గుర్తించారు. చదువుల్లో వెనుకబాటులో ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. తెలుగులో భాషాంశాలు, ప్రతిస్పందన అంశాలతో పాటు హిందీలో పేరాగ్రాఫ్‌లో ఉండే 20 మార్కులు, మల్టీబుల్ చాయిస్‌లో 12 మార్కులను పొందేందుకు ఏ విధంగా చదవాలో వివరిస్తున్నారు. గణితంలో గ్రాఫ్, సంఖ్యాశాస్త్రం, సంభావ్యత, సైన్స్‌లో డయాగ్రామ్, సోషల్‌లో మ్యాప్ పాయింటింగ్, ఇంగ్లీష్‌లో గ్రామర్ పాయింట్లపై ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు.

**రెండు గంటల పాటు అదనపు తరగతులు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారి తల్లిదండ్రులు అంగీకారంతో ఉదయం 8 నుంచి 9 వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులను అందిస్తున్నారు. అనంతరం రాత్రి సమయాల్లో ఇంటి వద్ద విద్యార్థులు చదువుతున్నారో లేదో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నారు. విద్యార్థుల చదువులను తల్లిదండ్రులకు వివరించడంతో పాటు ఆయా పాఠ్యాంశాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. మాడుగుల నియోజకవర్గంలో గల నాలుగు మండలాల్లో పది పబ్లిక్ పరీక్షలకు కె.కోటపాడు మండలం నుంచి 416 మంది, చీడికాడ మండలం నుండి 477, దేవరాపల్లి మండలం నుంచి 367 మంది, మాడుగుల మండలం నుంచి 652 మంది హాజరుకానున్నారు.



ఉగ్గినవలసలో విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి సూచనలు అందిస్తున్న ఉపాధ్యాయుడు



**పరీక్షలంటే భయం పోగొట్టేలా...**

పది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎంతగానో మేలు చేకూర్చనున్నాయి. పాఠశాలల్లో బాగా చదివే విద్యార్థులను, చదువుల్లో కొంచెం వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించాం. చదువుల్లో వెనుకబడ్డ విద్యార్థులకు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పరీక్షలను ఏ విధంగా ఎదుర్కోవాలని, పరీక్ష సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతతతో పరీక్షలను రాసేలా ఈ తరగతుల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. –పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు, కె.కోటపాడు హైస్కూల్



**మంచి మార్కులు సాధిస్తా..**

పదో తరగతి సిలబస్‌ను డిసెంబర్ నాటికి ఉపాధ్యాయులు చెప్పారు. ప్రస్తుతం రివిజన్ తరగతులతో పాటు పాఠశాల ఆవరణలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మోడల్ పరీక్షలను నిర్వహిస్తూ పరీక్షలంటే భయం పోయేలా ఉపాధ్యాయులు చూస్తున్నారు. పది పబ్లిక్ పరీక్షలలో తప్పకుండా 550కు పైగా మార్కులను సాధిస్తాను.
–అనిత, పది విద్యార్థిని, కె.కోటపాడు

### 19న శివ మహాపడి పూజ

కె.కోటపాడు : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చౌడువాడ కాశీ విశ్వేశ్వరాలయంలో ఈ నెల 19న శివ మహాపడి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు దీవి అప్పలకొండ(దత్తు) తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి సతకం పట్టు రామాలయం వద్ద ఈ శివ మహాపడి పూజ జరపనున్నట్టు తెలిపారు. శివ భక్త సేవకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి శివ మాలాధారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### శ్మశాన వాటికలో స్వచ్ఛభారత్



శ్మశాన వాటికలో తుప్పలు తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యం

రోలుగుంట : బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో గల శ్మశాన వాటిక ఆవరణలో తుప్పలు పెరిగి ఉండడంతో మండల బీజేపీ అధ్యక్షుడు పచ్చిగోళ్ల ఈశ్వరరావు కొంతమందితో కలసి తుప్పలు తొలగించి శుభ్రం చేశారు. శ్మశానవాటిక ఆవరణలో ఉన్న తుప్పలను తొలగించారు.

### రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు

మాకవరపాలెం : ఈ నెల 18 నుంచి 21 వరకు ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఈ నెల 18న బూరుగుపాలెం, వజ్రగడ, మాకవరపాలెం, 19న బూరుగుపాలెం, గిడుతూరు, శెట్టిపాలెం, 20న తూటిపాల, కోడూరు, పి.పి.అగ్రహారం, 21న పాపయ్యపాలెం, రాచపల్లి, పి.పి.అగ్రహారం సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆరేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విద్యార్థినుల భద్రత సమష్టి బాధ్యత

- డీఎస్పీ శ్రీనివాసరావు
- అంబేడ్కర్ గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు



హాజరైన విద్యార్థినులు

నర్సీపట్నం : విద్యార్థినుల చదువుకు సురక్షితమైన వాతావరణం ఉండేలా చూడాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయాన్ని డీఎస్పీ పరిశీలించారు. విద్యార్థినుల భద్రతకు ఉన్న చర్యలను తనిఖీ చేశారు. పిల్లలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈవీటీజింగ్, చైల్డ్ మ్యారేజ్, సైబర్ నేరాల గురించి విద్యార్థినులకు వివరించారు. పిల్లల భద్రతకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి బాధ్యత వహించాలన్నారు. పిల్లలు ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి ఆరోగ్యకరమైన వాతావరణ ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాల భద్రతతో పిల్లల భావోద్వేగం, భౌతిక భద్రత ముడిపడి ఉన్నాయన్నారు. పిల్లలను హింస, బెదిరింపు, వేధింపులు, సైబర్ నేరం, మాదక ద్రవ్యాల దుర్వినియోగం నుంచి సురక్షితంగా ఉంచడం పాఠశాల భద్రతలో భాగమన్నారు. బాల్య వివాహాల వల్ల విద్యార్థినుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి చదువుపై మనస్సు పెట్టాలన్నారు. ఎవరైనా బాలికలపై వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కేసులో ఇరుక్కున్న విద్యార్థుల జీవితం ఎందుకూ పనికిరాకుండా పోతుందన్నారు. సైబర్ నేరాల ముసుగులో పడకుండా విద్యార్థులు అవగాహన పొందడంతో పాటు తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను వేధించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ జి.గోవిందరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు : మండలంలో మేడిచర్ల గ్రామంలో గల భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిపారు. గ్రామస్తులు ఉదయం నుండే మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

### ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

చీడికాడ : అర్జునగిరిలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి వ్యాధులతో బాధపడుతున్న ఐదుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు కంటి వైద్యులు పి.శ్రీనివాసరావు తెలిపారు. గాజువాకకు చెందిన కిరణ్ విజన్ సెంటర్ వారి సౌజన్యంతో గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా సర్పంచ్ బి.రమాదేవి చేతుల మీదుగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారన్నారు. 40 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో ఐదుగురిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు.

## ఆలయానికి టేకు ద్వారబంధం బహూకరణ



ఆలయంలో టేకు ద్వారబంధం అందజేస్తున్న దాతలు వరహామూర్తి , సర్వేశ్వరావు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలోని మోదమాంబ ఆలయానికి గ్రామానికి చెందిన కార్పెంటర్లు టేకు కర్రతో తయారు చేసిన ద్వారబంధాన్ని విరాళంగా సమర్పించారు. గ్రామానికి చెందిన కోట్ని వరహామూర్తి, నాగలక్ష్మి, చలపాక సర్వేశ్వరావు నాగలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో సుమారు రూ.20 వేలు విలువ చేసే ద్వారబంధాన్ని ఆదివారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. ద్వారబంధం మీద లక్ష్మీదేవి, సరస్వతిదేవి, వేంకటేశ్వరస్వామి, కనక మహాలక్ష్మి, కనకదుర్గమ్మ బొమ్మలు చెక్కారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై దుకాణాలతో ట్రాఫిక్‌కు అంతరాయం



వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం

నర్సీపట్నం : చింతపల్లి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌తో ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలుదారులు, రైతులతో మెయిన్ రోడ్డు రద్దీగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ వలయంలో నుంచి బయటపడేందుకు వాహనదారులు నరకం చూస్తున్నారు.

కరోనా సమయంలో అబిద్‌సెంటర్‌లో ఉండే ఇందిరా మార్కెట్‌ను ఐదేళ్ల క్రితం చింతపల్లి రోడ్డు పీనారపాలెం వద్దకు మార్పు చేశారు. వ్యాపారులంతా మెయిన్ రోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేల మంది నిత్యం మార్కెట్‌కు వస్తున్నారు. గ్రామీణ ప్రాంత రైతులు పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముతుంటారు. ప్రతి రోజు రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారులతో మార్కెట్ ప్రాంతం రద్దీగా ఉంటుంది. మంగళ, శని, ఆదివారాల్లో మార్కెట్ కిటకిటలాడుతుంది. ఖాళీ స్థలం లేక రైతులు తీసుకువచ్చిన కూరగాయలు రోడ్డుపైనే పెట్టి విక్రయాలు చేస్తున్నారు. తాత్కాలిక దుకాణాలు రోడ్డుపైకి రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సువిశాలమైన ఇందిరా మార్కెట్ ప్రాంతానికి దుకాణాలు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వెంకన్న ఆలయంలో అన్నదానం ట్రస్ట్ ఏర్పాటు



కొత్తగా ఏర్పడిన ట్రస్టు పనులకు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

చోడవరం : స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు కార్యక్రమాలను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రారంభించారు. ఇప్పటి వరకూ ఈ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాలు ఏమీ లేకపోవడంతో ఇక నుంచి కొత్తగా ఏర్పడిన ట్రస్టు ద్వారా ప్రతి నెలా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ట్రస్టుకు రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ట్రస్ట్ కన్వీనర్‌గా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, అధ్యక్షుడుగా తాడి పనసారెడ్డి, కార్యదర్శిగా ఉపాధ్యాయుల శ్రీనివాస్‌ను నియమించారు. సంయుక్త కార్యదర్శిగా అడపా భూలక్ష్మి, కోశాధికారిగా పార్థు, ఉపాధ్యక్షుడుగా జలుమూరి కాశీరాజును నియమించారు. వీరితోపాటు 9మంది కమిటీ సభ్యులుగా నియమించారు. వీరి పర్యవేక్షణలో ఇక నుంచి శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. ఆలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, పార్కును అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడి మంచినీటి ట్యాంక్‌ను వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సకురు కోటేశ్వరరావు, ఎంపీటీసీ చిన్న, వార్డు మెంబరు తానవరపు శ్రీనివాసరావు, గూనూరు ప్రభాకర్ కందర్ప రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజలు చేశారు.

### అర్చకుడు చిన్నిస్వామికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న అర్చకుడు చిన్నిస్వామి

అనకాపల్లి టౌన్: స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డును స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పేరూరి చిన్నిస్వామి అందుకున్నారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆలయాల్లో హిందూ సంస్కృతీ సంప్రదాయాలను చాటి చెప్పడంలో కీలక పాత్ర అర్చకులదే నని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు వాడే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని దుర్వినియోగం చేస్తూ అనేక అక్రమాలకు బ్లాక్ మెయిల్స్‌కు పాల్పడుతున్నారన్నారు. ఫోన్లో వీడియోలు, అసభ్యకర సందేశాలు పంపించడం, ప్రొఫైల్‌పిక్స్‌ను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగడం వంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా, ఆధార్, పాన్‌కార్డు వివరాలు కావాలంటూ ఫోన్లు చేసి ఓటీపీలు తెలుసుకుని నగదు కాజేస్తున్నారన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడమే కాకుండా, ఇళ్లకు వెళ్లినప్పుడు నిరక్షరాస్యులైన కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారికి తెలియజేయాలన్నారు. కళాశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల సిబ్బంది లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

## మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మాడుగుల మోదకొండమ్మ



అమ్మవారి సన్నిధిలో వెలసిన పాదాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ముందుగా ఆలయంలో వెలసిన పాదాలును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, తాగు నీరు అందజేశారు.

## ప్రమాదపుటంచున ఎం.కోడూరు వంతెన



దెబ్బతిన్న తాచేరు వంతెన

మాడుగుల : మాడుగుల నుంచి ఎం.కోడూరు మీదుగా పాడేరు వెళ్లడానికి 20 ఏళ్ల కిందట తాచేరుపై చిన్న వంతెన నిర్మాణం చేపట్టారు. ఆ వంతెనకు రెండు వైపులా రక్షణకు అప్పటిలో చిన్న చిన్న స్తంభాలు ఏర్పాటు చేసారు. ప్రస్తుతం అవి విరిగిపోవడంతో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలో సుమారు 18 గ్రామాల ప్రజలకు మాడుగుల వారపు సంతకు రావడానికి ఈ వంతెనే ఆధారం. సంబంధింత అధికారులు స్పందించి ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.